క్లుప్తంగా

మదర్ గార్డెన్స్ ఏర్పాటు చేయాలి

లింగపాలెం: విద్యార్థుల పోషకాహారానికి పాఠశాల ఆవరణలో మదర్ గార్డెన్స్‌ను ఏర్పాటు చేయాలని ఎంఈవో కె రామారావు అన్నారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా శనివారం శింగగూడెం హైస్కూల్‌లో విద్యార్థులచే మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంఈవోలు కె.రామారావు, జె రవీంద్ర మాట్లాడుతూ తల్లిదండ్రులు, విద్యార్థులు కలసి నాటిన మొక్కలన్నింటిని కలిపి ఒక మదర్ గార్డెన్‌లా సృజనాత్మకంగా తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం బి శ్రీధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆహారం అందజేత


ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గర్భిణులకు ఆహారాన్ని అందిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కుకునూరు, వేలేరుపాడు మండలాల్లో ముంపునకు గురైన గ్రామాల నుంచి గర్భిణులు, బాలింతలు 32 మందిని స్థానిక ఏరియా ఆసుపత్రిలో చేర్చి వైద్యసేవలు అందిస్తున్నారు. ఈ క్రమంలో వారికి రాత్రి పూట భోజనం అందించే బాధ్యతను ఇటీవల రోటరీ క్లబ్ స్వీకరించింది. శనివారం రోటరీ అధ్యక్షుడు ఊడా రాంగోపాల్, కార్యదర్శి బవిరిశెట్టి తిలక్ ఆధ్వర్యంలో ఆహారాన్ని అందించారు. రోటరీ పూర్వ కార్యదర్శి జవ్వాజి ఉమా వెంకటేష్, స్థానిక చరిత హాస్పిటల్ అధినేత వందనపు ప్రేమ్ చంద్ వితరణతో అందించారు. అసిస్టెంట్ గవర్నర్ దాకారపు కృష్ణ, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

భావితరాల మనుగడకు మొక్కలు నాటాలి


పంగిడిగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కను నాటుతున్న దృశ్యం

ద్వారకాతిరుమల: భావితరాల మనుగడకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పంగిడిగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.సురేష్ అన్నారు. స్థానిక పాఠశాల ఆవరణలో శిక్షా సప్తాహ్–విద్యా వారోత్సవాల్లో భాగంగా శనివారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా పలువురు విద్యార్థుల తల్లులతో మొక్కలు నాటించారు. ఉపాధ్యాయులు శారద, ముస్తాన్ బీబీ, పెద్దిరాజు, ప్రభాకరరావు, మల్లయ్య, రమేష్, పద్మ, మహాలక్ష్మి, జాన్సీ, జయలక్ష్మి, ఉషాదేవి పాల్గొన్నారు.

డీఈఓ తనిఖీ


బెస్తగూడెం పాఠశాలను పరిశీలిస్తున్న డీఈఓ

కుక్కునూరు: మంత్రుల పర్యటన నేపథ్యంలో శనివారం కుక్కునూరు వచ్చిన జిల్లా విద్యాశాఖ అధికారి అబ్రహం మండలంలోని బెస్తగూడెం పాఠశాలను తనిఖీ చేశారు. తరగతి గదులను పరిశీలించారు. ప్రభుత్వం ఇచ్చే స్టూడెంట్ కిట్లను విద్యార్థులు అందరికీ ఇవ్వాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారంగా నిర్వహించాలని ఆదేశించారు. విద్యార్థులకు మంచి విద్యా బోధన అందించాలని, పిల్లల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో గిరి భగవాన్ దాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

9న నిరసనలు

ఏలూరు (టూటౌన్): కేంద్ర మోదీ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి నిధులు కేటాయింపు పెంచాలని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా సమావేశం డిమాండ్ చేసింది. స్థానిక పవరుపేటలోని అన్నే భవన్‌లో సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా సమావేశం శనివారం నిర్వహించారు. ఆగస్టు 9న కార్పొరేట్స్ క్విట్ ఇండియా డే నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని సమావేశం పిలుపునిచ్చింది.

డాక్టరేట్ ప్రదానం


డాక్టరేట్‌ను అందుకుంటున్న ఏలూరి ఫణికుమార్

జంగారెడ్డిగూడెం: పట్టణానికి చెందిన ఆర్య వైశ్య ప్రముఖులు, వ్యాపారవేత్త ఏలూరు ఫణికుమార్ కర్ణాటక రాష్ట్రం హోసూరులో ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో డాక్టరేట్ అందుకున్నారు. సేవా కార్యక్రమాలతో పాటు వ్యాపార రంగంలో ఎందరికో ఉపాధి కల్పించినందుకుగాను ఆయనకు ఈ పురస్కారం దక్కింది.

మెట్టలో జోరుగా వరినాట్లు

- ఇప్పటికీ 40 శాతం పూర్తయిన వరినాట్లు
- వ్యవసాయ పనుల్లో రైతులు బిజీబిజీ


మెట్ట ప్రాంతంలో ట్రాక్టర్‌తో దమ్ము దుక్కులు చేసుకుంటున్న రైతు


మెట్ట ప్రాంతంలో నారుమడిలో నారు సేకరిస్తున్న రైతు

చింతలపూడి: ఒక పక్క వర్షాలు కురుస్తున్నా మెట్ట ప్రాంతంలో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమై ఉన్నారు. గత 15 రోజులుగా కురుస్తున్న వర్షాలకు మెట్ట రైతులు ఖరీఫ్ వ్యవసాయ పనుల్లో బిజీగా ఉన్నారు. చింతలపూడి సబ్‌డివిజన్ పరిధిలో ఇప్పటి వరకు 40 శాతం వరినాట్లు పూర్తయినట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. సబ్‌డివిజన్ పరిధిలో 15,792 హెక్టారుల్లో వరి సాగు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో చింతలపూడి మండలంలో అత్యధికంగా 7,603 హెక్టార్లు లక్ష్యం కాగా ఇప్పటివరకు 2,040 హెక్టార్లు, లింగపాలెం మండలంలో 3,072 హెక్టార్లకు గాను 1,605 హెక్టార్లు, కామవరపుకోట మండలంలో 2,457 హెక్టార్లకు గాను 1,044 హెక్టార్లు, టి నరసాపురం మండలంలో 2,661 హెక్టార్లకు గాను 225 హెక్టార్లలో నాట్లు వేయడం పూర్తయ్యింది.

ఆందోళన వద్దు

అధిక వర్షాల కారణంగా పొలాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏడీ నాగకుమార్ రైతులకు పలు సూచనలు చేశారు. నారుమడి దశలో ఉన్న వరి పంట విత్తనం చల్లిన రెండు, మూడు రోజుల వయస్సులో ఉన్నప్పుడు మూడు రోజుల కన్నా ఎక్కువ రోజులు నీట మునిగితే మొలకశాతం గణనీయంగా తగ్గిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ దశలో నారుమడిలో నీటిని వీలైనంత త్వరగా తొలగిస్తే విత్తనం కోర గాలి పోసుకుని ఎటువంటి నష్టం జరగదన్నారు. ఒకవేళ నీరు తీసే అవకాశం లేకపోతే మరోసారి విత్తనాలు చల్లాల్సి వస్తుందని అన్నారు. విత్తిన 7 నుంచి 30 రోజుల మధ్యలో నారుమడి ఉంటే 5 రోజుల కన్నా ఎక్కువగా నీట మునిగి ఉంటే నీటిని బయటికి తీసివేయాలన్నారు.

పారిజాతగిరిలో పూజలు


విశేషాలంకరణలో శ్రీవేంకటేశ్వరస్వామి

జంగారెడ్డిగూడెం: స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుప్రభాత సేవ, ఆరాధన, తోమాల సేవ, బాల భోగ నివేదన, తీర్థ ప్రసాద గోష్టి తదితర పూజలు అర్చకులు నల్లూరి రవికుమారాచార్యులు జరిపారు. జిల్లా నలుమూలల నుంచి, ఏజెన్సీ ముంపు మండలాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించి మొక్కుబడులు సమర్పించుకున్నారు. భక్తులకు దాతలు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమాలను ఆలయ ఈవో మానికల రాంబాబు పర్యవేక్షించారు.

నేడు చింతాలమ్మకు కుంభాభిషేకం

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం గ్రామదేవత శ్రీచింతాలమ్మ అమ్మవారికి ఆదివారం కుంభాభిషేకం నిర్వహించనున్నారు. మహిళలు పసుపు పారాణి కలిపిన నీళ్ల బిందెలతో కుంభాభిషేకంలో పాల్గొనవలసిందిగా నిర్వాహకులు పేర్కొన్నారు. గ్రామ సుభిక్షం ఆకాంక్షిస్తూ అమ్మవారికి జలాభిషేకం నిర్వహిస్తున్నట్లు రైతు అభ్యుదయ అభివృద్ధి కమిటీ, పాలక మండలి కమిటీలు పేర్కొన్నాయి.

31న స్పాట్ అడ్మిషన్లు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లమో ఇన్ సివిల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్‌లో మిగిలిన సీట్ల భర్తీకి ఈనెల 31న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి.సుబ్రహ్మణ్యం తెలిపారు. 10వ తరగతి పాస్ అయిన ఆసక్తిగల విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో సంప్రదించాలన్నారు. 30వతేదీ లోగా దరఖాస్తులను అందజేయాలని, ఇప్పటికే పాలిసెట్ 2024 కన్వీనర్ కోటలో అడ్మిషన్లు ముగిసినట్లు సుబ్రహ్మణ్యం తెలిపారు.

జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండండి


శ్రీరాంపురం గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న దృశ్యం

చింతలపూడి: జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య విస్తరణ అధికారి ఎస్‌కే అబ్రార్ హుస్సేన్ సూచించారు. మండలంలోని ప్రగడవరం పంచాయతీ శ్రీరాంపురం గ్రామంలో శనివారం కె గోకవరం పీహెచ్‌సీ వైద్యులు డా ఆర్ కృష్ణకిషోర్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలో వైద్య సిబ్బంది జ్వర పీడితుల వివరాలను సేకరించారు. శిబిరంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ అరుణ, విష్ణుమూర్తి, ఏఎన్‌ఎం సునీత వైద్య శిబిరంలో రోగులకు సేవలు అందించారు. ఈ సందర్భంగా దోమల వ్యాప్తిని అరికట్టే చర్యలను గురించి గ్రామస్తులకు వివరించారు. దోమకాటుకు గురికాకుండా ప్రతిఒక్కరూ దోమ తెరలు వాడాలని కోరారు. వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. నీటి తొట్టెలపై మూతలు వేసుకోవాలని అన్నారు. ప్రతీ శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు.

వరద బాధితులకు సీపీఎం సాయం


వరద బాధితులకు సాయాన్ని అందిస్తున్న సీపీఎం నాయకులు

కుకునూరు: భారీ వర్షాలు, గోదావరి వరదల కారణంగా పునరావాస సహాయక కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న కౌండిన్య ముక్తి వరద బాధితులకు శనివారం సీపీఎం ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు, కూరగాయలు, దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ, ఏళ్ల గడుస్తున్నా పోలవరం నిర్వాసితులకు న్యాయం జరగడంలేదన్నారు. ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణం పైనే శ్రద్ధ చూపుతున్నారు తప్ప ఆ ప్రాజెక్టు వల్ల సర్వం కోల్పోయిన నిర్వాసితుల పునరావాస పరిహారం కోసం పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు తెల్లం దుర్గారావు, సీపీఎం కుక్కునూరు మండల కార్యదర్శి వై నాగేంద్రరావు, మండల నాయకులు మేడిపల్లి బాబు వై సాయికిరణ్, ఎస్ లక్ష్మణరావు రమేష్ జంగారెడ్డిగూడెం నాయకులు సూర్యారావు జీలుగుమిల్లి నాయకులు సీతారామయ్య పాల్గొన్నారు.

అబ్దుల్ కలాంకు నివాళి


జంగారెడ్డిగూడెం: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కలాంకు నివాళులు అర్పిస్తున్న దృశ్యం


పోలవరం: కలాం చిత్రపటానికి పూలమాల వేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: భారత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం 9వ వర్ధంతిని స్థానిక దామోదర సంజీవయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. కళాశాలలో ఉన్న కలాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. శాస్త్రవేత్తగా, భారత రాష్ట్రపతిగా కలాం చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అబ్దుల్ కలాం విగ్రహ దాత ఆకుల రామచంద్రరావు, ఫౌండేషన్ చైర్మన్ యర్రా అప్పారావు, మల్లేశ్వరరావు, పెనుమర్తి సురేష్, ప్రతిభా రాజు, లవరాజు, రూపాదేవి, కాలేజ్ ప్రిన్సిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

పోలవరం రూరల్: దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతి పోలవరంలో నిర్వహించారు. స్థానిక యువకులు కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అబ్దుల్ కలాం సేవలను కొనియాడారు. కలాం యువతకు ఇచ్చిన పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ ఉన్నత శిఖరాలను అధిరోహించడంలో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో షెహన్‌షా బాష, పఠాన్ ఖాజా, అనిశెట్టి పరమేశ్వరరావు, సున్నం సుదీప్ తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: భారతరత్న అబ్దుల్ కలాం వర్ధంతి కార్యక్రమం కుంతలగూడెం గ్రామంలో శనివారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయపూడి వెంకటరమణ ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం చిత్రపటానికి చిన్నారులు నివాళులు అర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. అణు పాటవంతో శత్రు దేశాలకు భారత్ అంటే వణుకు పుట్టించారని, సాధారణ జీవితాన్ని గడిపిన ఆయన మనకు ఆదర్శనీయం అని ప్రధాన ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అబ్దుల్ కలాంకి సంబంధించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

ముంపులో ప్రాజెక్టుకు వెళ్లే రోడ్డు


పోలవరం కడెమ్మ స్లూయిజ్ వద్ద గోదావరి వరద

పోలవరం ప్రాంతంలో ముంపునకు గురైన పొలాలు

పోలవరం రూరల్: గోదావరి వరద గంట గంటకు పెరుగుతుండటంతో పోలవరం ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతానికి వెళ్లే ప్రధాన రోడ్డు మార్గంలో వరద నీరు చేరుకుంది. పోలవరం పంచాయతీ పరిధిలోని కడెమ్మ స్లూయిజ్ వద్ద వరదనీరు భారీ స్థాయిలో చేరుకుంది. రోడ్డు మార్గంలో మెల్లగా ముంపునకు గురవుతోంది. ఆదివారం నాటికి ఈ రోడ్డు మార్గం ముంపునకు గురైతే రాకపోకలు నిలిచిపోయే పరిస్థితి ఉంది. ప్రాజెక్టుకు వెళ్లేందుకు ప్రత్యామ్నాయ రోడ్డు మార్గాన్ని ప్రాజెక్టు ఏజెన్సీ ప్రతినిధులు ఏర్పాటు చేస్తున్నారు.

ముంపులో వరి పొలాలు

పోలవరం రూరల్: గత వారం రోజులుగా కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షాలతో పాటు మరోవైపు గోదావరి వరద కూడా ఉగ్రరూపం దాల్చుతోంది. పోలవరం ప్రాంతంలో వరినాట్లు వేసిన పొలాలు జలమయమయ్యాయి. నారుమడులతోపాటు, వరి పొలాలు అత్యధిక శాతం నీటి ముంపులోనే కొనసాగుతున్నాయి. మరో వైపు భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరికలు జారీ చేయడంతో రైతుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. వరినారు మడులు పూర్తిగా కుళ్లిపోయే పరిస్థితి ఉందని, వరి నారు దొరకడం కూడా కష్టమేనని రైతులు వాపోతున్నారు. గోదావరి వరద తగ్గితే తప్ప ఈ నీరు పూర్తిగా నదిలోకి చేరే పరిస్థితి లేదన్నారు. ఎప్పటికి వర్షాలు తగ్గుతాయో, వరద తగ్గుతుందో తెలియని పరిస్థితి నెలకొందని వాపోయారు. ఈ ఏడాది వరి నాట్లు ఎప్పటికి పూర్తవుతాయో తెలియని పరిస్థితి ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన


కొండగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

కామవరపుకోట: మిషన్ శక్తి 100 రోజుల కార్యక్రమంలో భాగంగా కామవరపుకోట శివారు కొండగూడెం అంగన్‌వాడీ పరిధిలో గ్రామంలో ర్యాలీ నిర్వహించి, మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏరియా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ బీవీఎల్ మంగాదేవి మాట్లాడుతూ ప్రభుత్వం మహిళా రక్షణకై అనేక చట్టాలను తీసుకొచ్చిందన్నారు. లింగ వివక్షత లేకుండా పురుషులతో సమానంగా మహిళలకు అన్ని అవకాశాలు కల్పించిందన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, మహిళల గృహ హింస, అక్రమ రవాణా నిరోధక చట్టం వంటి అంశాలు గూర్చి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థులకు కిట్ల పంపిణీ


విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అఖిలపక్ష రాజకీయ పార్టీ నాయకులు ఆకాంక్షించారు. పొంగుటూరు ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు సంకు కొండలరావు ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పసుపులేటి రాంబాబు, ఎంపీటీసీ నేలపోలు దుర్గారావు, ఉపాధ్యాయులు పాండురంగ, సుబ్బారావు, శ్యామల, వైఎస్సార్ సీపీ, జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు గేలం భాస్కరరావు, కాసాగాని గోపాలకృష్ణ గోఖలే, ప్రగడ రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

సంరక్షణ కేంద్రానికి బాలుడు


బాలుడిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న రైల్వే ఎస్సై సైమన్

ఏలూరు టౌన్: ఏలూరు పెద్ద రైల్వేస్టేషన్‌లో ఒక బాలుడు ఒంటరిగా ప్లాట్‌ఫామ్‌పై తిరుగుతూ ఉండగా రైల్వే ఎస్సై పి.సైమన్ గుర్తించారు. బాలుడిని వివరాలను ఆరా తీయగా తాను నాందేడ్ ప్రాంతం నుంచి వచ్చి ద్వారకాతిరుమల వేద పాఠశాలలో వేద విద్యను అభ్యసిస్తున్నట్లు తెలిపాడు. తన పేరు పఠకే మయూర్ గజానంద్‌గా తెలిపిన బాలుడు తనకు వేద పాఠశాలలో ఉండేందుకు ఇష్టంలేక పారిపోయి వచ్చానని తెలిపాడు. అనంతరం రైల్వే ఎస్సై సైమన్ విషయాన్ని వేద పాఠశాల యాజమాన్యానికి, బాలుడి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. అదేవిధంగా ఏలూరు జిల్లా చైల్డ్‌లైన్ అధికారులకు సమాచారం ఇచ్చి బాలుడిని సంరక్షణ కేంద్రానికి అప్పగించినట్లు రైల్వే ఎస్సై తెలిపారు.

మహిళలపై దాడులు ప్రభుత్వ వైఫల్యమే

కుక్కునూరు: చెరువు కొమ్ముగూడెం గ్రామానికి చెందిన చిన్నారిపై లైంగికదాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు చేపట్టాలని ఏపీ మహిళా సమాఖ్య, సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలపై జరిగే దాడులను తీవ్రంగా ఖండిస్తున్నట్టు చెప్పారు. మహిళలపై జరిగే దాడులను అరికట్టడంతో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో కామాంధుల పైశాచికత్వానికి అడ్డూ అదుపు లేకుండా పోయిందన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని లేని పక్షంలో బాధిత కుటుంబానికి అండగా ఉండి పోరాడతామని హెచ్చరించారు.

యువతిని మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

టి.నరసాపురం: యువతిని మోసం చేసిన నేరంపై ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై డి.దుర్గామహేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని సున్నపురాళ్లపల్లికి చెందిన తొట్టి రాధాకృష్ణ కుమార్తెను అదే గ్రామానికి చెందిన సోడెం నాగరాజు అనే వ్యక్తి ప్రేమ పేరుతో వెంటపడేవాడు. ఈ క్రమంలో యువతికి నాగరాజు శారీరకంగా దగ్గరయ్యాడు. విషయం తెలిసిన యువతి తండ్రి పెద్దల దృష్టికి తీసువెళ్లగా వారిద్దరికి వివాహం నిశ్చయించి 2023 ఆగస్టులో నిశ్చితార్థం జరిపించారు. అయితే ఇప్పుడు ఆమెను పెళ్లి చేసుకోనని నాగరాజు బెదిరిస్తున్నాడని బాధిత యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేయగా, జీలుగుమిల్లి సీఐ టి.క్రాంతికుమార్ దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

హోం మంత్రి అనితకు వినతి పత్రం

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం అభివృద్ధికి కృషి చేయాలని కోరుతూ హోం మంత్రి వంగలపూడి అనితకు కూటమి నాయకులు వినతిపత్రం సమర్పించారు. వరద బాధితులను పరామర్శించడానికి వచ్చిన ఆమె తిరుగు ప్రయాణంలో మంత్రులు అచ్చం నాయుడు, నిమ్మల రామానాయుడులతో కలిసి కొయ్యలగూడెం మీదుగా వెళుతున్న సందర్భంగా మెయిన్ సెంటర్లో మంత్రి కాన్వాయ్‌ని ఆపి నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు, ఫైర్ స్టేషన్ నిర్మాణం, పోలీస్ స్టేషన్ గ్రౌండ్ చుట్టూ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాల్సిందిగా వినతి పత్రంలో నాయకులు పేర్కొన్నారు. జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ చింతల వెంకటరమణ, టీడీపీ టౌన్ ప్రెసిడెంట్ జేస్త రామకృష్ణ పాల్గొన్నారు.

వెంకటేశ్వరరావు మృతికి సంతాపం

టి.నరసాపురం: చాట్రాయి మండలం చనుబండ గ్రామ నివాసి ప్రముఖ బుర్రకథ కళాకారుడు పొదడపాల వెంకటేశ్వరరావు మృతికి బుర్రకథ కళాకారులు సంతాపం తెలిపారు. బుర్రకథ కళాకారుడిగా వెంకటేశ్వరరావు చేసిన సేవలను కొనియాడారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రజానాట్యమండలి గౌరవ అధ్యక్షుడు నబ్బి కనకారావు, ఏలూరు జిల్లా ప్రజానాట్యమండలి కన్వీనర్ టీవీఎస్ రాజు, ప్రముఖ బుర్రకథ కళాకారుడు వీరమల్ల సత్యనారాయణ ఏపీ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్ఆర్ కృష్ణబాబు, ప్రజానాట్యమండలి బుర్రకథ కళాకారుడు ఎం.ప్రేమానందం, మహిళా బుర్రకథ కళాకారిణి విభూది రాజేశ్వరి, బచ్చు నందకుమార్ తదితరులు సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు.

30న గౌడ సంఘం సమావేశం

జంగారెడ్డిగూడెం: అఖిల భారత గౌడ సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని జాతీయ అధ్యక్షుడు పేరం శివనాగేశ్వరరావు ఇంటి వద్ద ఈనెల 30వ తేదీ ఉదయం 10 గంటలకు ఏర్పాటు చేసినట్లు సంఘ నాయకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌతు లచ్చన్న 115వ జయంతి కార్యక్రమ నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లపై చర్చిస్తామన్నారు. అలాగే రాష్ట్రంలో కల్లుగీత కార్మికుల సమస్యలు, గౌడ శెట్టిబలిజ, ఈడిగ, శ్రీశయన, యాత కులాల ఐక్య కార్యాచరణ తదితర విషయాలపై కార్యక్రమంలో చర్చిస్తారన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దాసరి శ్యామ్ చంద్ర శేషు అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.